ఈనాడు వరంగల్

సోమవారం అక్టోబరు 7, 2024

మోస్తరు వర్షం.. తడిసిన మక్కలు



మార్కెట్‌లో మక్కలను దగ్గర చేస్తున్న రైతు

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేటలో ఆదివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆరబోసిన మొక్కజొన్నలు తడిసిపోయాయి. వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న మక్కలను ఎత్తుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. అప్పటికే ధరలేని మక్కల కాంటాలు ఆలస్యంగా సాగాయి. వల్లభ్‌నగర్‌లో పాత సామిల్ వద్ద, మల్లంపల్లి మార్గంలో దర్గా వద్ద జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచిపోయింది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల కోసం అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణం రహదారిపై కూలిపోయింది. న్యాయస్థానం ఎదుట, ఓంకార్ విగ్రహం వద్ద, పోస్టాఫీసు సందు నుంచి తెలంగాణ విగ్రహం వరకు, 15వ వార్డులో రహదారులు మడుగుల్లా మారాయి. ద్వారకాపేట రోడ్డులో యూనియన్ బ్యాంకు, ఆర్టీఏ కార్యాలయం, ఏసీపీ కార్యాలయం వద్ద ఇదే పరిస్థితి.

మహాలక్ష్మి..!

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివనగర్‌లోని శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ లలితాదేవి అమ్మవారిని భక్తులు నోట్లతో అల్లిన మాలలు, నాణేలతో శ్రీమహాలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు.

– న్యూస్‌టుడే, శివనగర్



భద్రకాళి.. బంగారు తల్లి



స్వర్ణ కిరీటం, జటామకుటాలు, కర్ణ పత్రాలు

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ ఇంద్రకీలాద్రిగా పేరుగాంచిన ఓరుగల్లు శ్రీభద్రకాళి అమ్మవారు బంగారు ఆభరణాలతో దివ్య తేజస్సుతో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారికి ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జటా మకుటాలు, కర్ణ పత్రాలతో పాటు భక్తులు సమర్పించిన కానుకలు అనేకం ఉన్నాయి. పసిడి కాంతులతో దర్శనమిస్తున్న భద్రకాళి మాతను చూసి భక్తులు పులకించిపోతున్నారు.

● శ్రీదేవి శరన్నవరాత్రుల్లో రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన స్వర్ణ కిరీటం, జటా మకుటాలు, కర్ణ పత్రాలు అమ్మవారికి అలంకరిస్తారు. శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ బ్రాహ్మోత్సవాల్లో కొన్ని ఆభరణాలు అలంకరిస్తారు.

అమ్మవారి ఆభరణాలు ఇవే..

● బంగారు స్వర్ణ కిరీటం: 4 కిలోల 70 గ్రాముల 088 మిల్లీగ్రాములు ● కర్ణ పత్రము- 1 కిలో 202 గ్రాముల 004 మి.గ్రా ● కర్ణ పత్రము-1 కిలో 149 గ్రాముల 022 మి.గ్రా ● జటా మకుటం- 2 కిలో 273 గ్రాము 013 మి.గ్రా. ● జటా మకుటం 2 కిలోల 368 గ్రాముల 040 మి.గ్రా. ● తెల్లరాళ్లతో ముక్కు పోగు పెద్దది: 104 గ్రా. ● చంద్ర వంక బొట్టు: 65 గ్రా 300 మి.గ్రా. (124 చిన్న ఎరుపు రాళ్లు, 01 పెద్ద ఎరుపు రాయి) ● ఒక ఎర్ర రాళ్ల బంగారు గాజు 340 గ్రా. ● ఒక ఎరుపు రాయి ముక్కు పోగు 10 గ్రా. ● అష్టలక్ష్మి చెంబు 605 గ్రా 600 మి.గ్రా

● ఒక రాళ్ల ముక్కు పోగు 19 గ్రా 950 మి.గ్రా ● ఒక తెల్ల రాళ్ల ముక్కు పోగు 21 ముత్యాలు, ఒక ఎర్ర పూస, 13.600 మి.గ్రా ● లక్ష్మి కాసుల నెక్లెస్ 20 గ్రా. 570 మి.గ్రా ● లక్ష్మి కాసుల పేరు 21గ్రా. 300 మి.గ్రా. ● 2 బంగారు గాజులు 16 గ్రా. 220 మి.గ్రా ● లక్ష్మి రూపంతో ఉన్న పచ్చల కెంపుల హారం 086- 730 మి.గ్రా ● అమ్మవారి రెండు పెద్ద పుస్తెలు, తాడు, రెండు గొట్టాలు, రాగి తీగతో కలిపి 192 గ్రా. ● పెద్ద ముక్కెర రాళ్లతో 44 గ్రా. ● అమ్మవారి పెద్ద మాంగల్య సూత్రం, తాడు, బంగారు గొట్టాలు, బంగారు గుండ్లు 130 గ్రా. ● కాసుల పేరు, రాళ్ల ముక్కు పోగు 262 గ్రా. ● ఒక ముక్కు పోగు 18గ్రా 850 మి.గ్రా.

–న్యూస్‌టుడే, రంగంపేట

బ్యాంకు లాకర్‌లోనే..: రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన బంగారు స్వర్ణ కిరీటం, జటా మకుటాలు, కర్ణ పత్రాలు, భక్తులు, దాతలు ఇచ్చిన బంగారు ఆభరణాలన్నీ హనుమకొండలోని బ్యాంకు లాకర్‌లో భద్ర పరుస్తారు. రోజు వారీగా అలంకరించే ఆభరణాలు దేవస్థానంలో ఉంటాయి.



కాసుల పేరు హారం



లక్ష్మి కాసుల హారం






బంగారు గాజులు



రెండు పెద్ద గాజులు



అష్టలక్ష్మి బంగారు చెంబు

పెద్ద పుస్తెలు


పెద్ద మాంగల్యం



ముక్కు పోగు



ముక్కు పుడక



చంద్ర వంక



పచ్చల హారం

అనుమతులు లేని ఆసుపత్రుల తనిఖీ



ఎలుకుర్తిహవేలీలో ప్రైవేటు ఆసుపత్రిలో వివరాలు ఆరా తీస్తున్న అధికారులు

గీసుకొండ, దుగ్గొండి (న్యూస్‌టుడే): గీసుకొండ, దుగ్గొండి మండలాల్లోని గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నిర్వహిస్తున్న పలు ఆసుపత్రులు, మందుల దుకాణాలను ఆదివారం తెలంగాణ వైద్య మండలి అధికారులు తనిఖీ చేశారు. గీసుకొండ మండలం ఎలుకుర్తిహవేలీలో కైలాసం అనే వ్యక్తి మోకాళ్ల నొప్పులకు ఇంజెక్షన్లు ఇస్తూ మోసం చేస్తున్నారని స్థానికులు ఫిర్యాదు చేయడంతో దాడులు చేసినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ ఛైర్మన్ నరేష్‌కుమార్, హెల్త్‌కేర్ రిఫామ్స్ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి తెలిపారు. కైలాసం పారిపోయినట్లు వారు తెలిపారు. మచ్చాపురంలో మధు అనే నకిలీ వైద్యుడు వెంకటేశ్వర మందుల దుకాణం నిర్వహిస్తూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా మంచాలు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నాడని తెలిపారు. గిర్నిబావిలో ఫస్ట్ సెంటర్ క్లినిక్ నిర్వాహకుడు గురుస్వామి, విశాలాక్షి మెడికల్ సెంటర్‌లో సోమనాథ్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో శ్రీరామోజు శ్రీనివాస్, రాజు అనుమతి లేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు వైద్యులు కారని, ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. స్టెరాయిడ్ ఇంజెక్షన్లు ఇవ్వడం, మంచాలు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమన్నారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నరేష్‌కుమార్, వెంకటస్వామి తెలిపారు.

గ్రేటర్‌లో నేడు ప్రజావాణి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్ మహా నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల వింగ్ అధికారులు పెండింగ్, పరిష్కార వివరాలతో హాజరుకావాలని కోరారు.

అలంకారప్రాయంగా డయాగ్నస్టిక్ కేంద్రం



న్యూస్‌టుడే, నర్సంపేట: నర్సంపేటలో ఏర్పాటుచేసిన డయాగ్నస్టిక్ కేంద్రం అలంకారప్రాయంగా మారింది. ఈ కేంద్రంలో 57 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తారని ప్రారంభోత్సవం నాడు అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు చెప్పారు. ఖరీదైన వైద్య పరీక్షలను ఉచితంగా చేసి రోగులకు వెంటనే నివేదికలు ఇస్తారన్నారు. ప్రస్తుతం రోగ నిర్ధారణ పరీక్షలకు రక్త నమూనాలు ఇచ్చిన బాధితులు వారం రోజులైనా నివేదికలందక దీనిచుట్టూ తిరుగుతున్నారు. వరంగల్ సీకేఎంతో సహా జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు కలిపి మొత్తం 26 కేంద్రాల నుంచి రోజూ రక్త నమూనాలు వస్తాయి. వచ్చిన వాటిని పరీక్షించగానే సిస్టమ్‌లో సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ అయి హైదరాబాద్‌లోని డయాగ్నస్టిక్ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందుతుంది. అక్కడి నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న చరవాణులకు సందేశం పంపుతారు. కానీ రక్త నమూనాలు ఇచ్చిన వారికి సమాచారం రావడం లేదని టీ-హబ్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రోగులు వాపోతున్నారు. జ్వరం రావడంతో గత నెల 23న నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికెళ్లి రక్తం నమూనా ఇచ్చాను. మరుసటి రోజు చరవాణికి నివేదిక వస్తుందని చెప్పినా, ఈ రోజు వరకు ఎలాంటి సమాచారం లేదని నర్సంపేటకు చెందిన భైరు రాధిక వాపోయారు.

● సీబీపీతో పాటు మరో ఏడు రకాల పరీక్షల నిమిత్తం వారం క్రితం రక్త నమూనాలు ఇచ్చినా ఇంతవరకు నివేదికలుగాని, సమాచారం గానీ లేదని దాసరపల్లి వాసి ఆదిరెడ్డి వివరించారు.

సీబీఐ అధికారినంటూ రూ.28.50 లక్షల టోకరా!

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: హనుమకొండ నగరంలో ప్రముఖ పారిశ్రామిక వేత్తకు సీబీఐ అధికారుల మంటూ సైబర్ నేరగాళ్లు రూ.28.50 లక్షలు టోకరా వేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2న పారిశ్రామిక వేత్తకు గుర్తు తెలియని మహిళ ఫోన్ చేశారు. ట్రాయ్ నుంచి మాట్లాడుతున్నామని, మీ ఆధార్‌కార్డు మొబైల్‌కు లింక్ చేయలేదని చెప్పారు. రెండు గంటల్లో ఫోన్ నెంబర్ బ్లాక్ చేస్తామని, త్వరలో మా ఉన్నతాధికారులు మీతో మాట్లాడతారని చెప్పి ఫోన్ పెట్టేశారు. కొద్దిసేపటి తర్వాత మరో మహిళ ఫోన్ చేసి తాను సీబీఐ ముంబయి బ్రాంచి అధికారినంటూ పరిచయం చేసుకున్నారు. తర్వాత వాట్సప్ వీడియోకాల్ చేసి సీబీఐ కార్యాలయం మాదిరిగా ఉన్న సెట్టింగ్‌ను చూపారు. మీరు మనీ ల్యాండరింగ్‌లో పాల్గొన్నారని, మీపై సీబీఐ కేసు నమోదు చేసిందని చెప్పారు. ఎప్పుడైనా మీ వద్దకు వచ్చి మా అధికారులు అరెస్టు చేస్తారని భయాందోళనకు గురిచేశారు. నరేష్ గోయల్ అనే వ్యక్తి మీ ద్వారా సుమారు రూ.6.8 కోట్లు మనీ ల్యాండరింగ్ చేశారని, అందుకోసం మీకు రూ.18.16 లక్షల కమీషన్ ఇచ్చారని చెబుతూ.. పూర్తి వివరాలు మా వద్ద ఉన్నాయని, ఈ కేసు నుంచి మీరు తప్పించుకోలేరని బెదిరించారు. ప్రస్తుతం మీ బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బు మేం సూచించిన ఖాతాలోకి మళ్లించాలని, కేసు విచారణ పూర్తయ్యాక ఎన్‌వోసీ ధ్రువీకరణతో పాటు మీ డబ్బు అప్పగిస్తామని నమ్మించారు. వారి మాటలకు భయపడిన పారిశ్రామిక వేత్త తనకు ఉన్న రెండు బ్యాంకు ఖాతాల నుంచి రూ.28.50 లక్షలు వారు చెప్పిన ఖాతాలోకి మళ్లించారు. రెండోజుల తర్వాత అవతలి వ్యక్తుల నెంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. అనుమానం వచ్చి పారిశ్రామిక వేత్త పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన పోలీసులు బాధితుడి నుంచి ఫిర్యాదు చేసుకొని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

మొక్కుబడిగా ఏర్పాట్లు..

తప్పేనా ఇక్కట్లు!

● 25 ప్రాంతాలకు రూ.కోటి నిధుల మంజూరు

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు మొక్కుబడిగా సాగుతున్నాయి. పండగ దగ్గర పడుతున్నా.. పనులు మాత్రం పూర్తి కావడం లేదు. గ్రేటర్ వరంగల్ పరిధిలో 25 ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు చేపట్టేందుకు ఇంజినీర్లు ప్రతిపాదించారు. బతుకమ్మ ఆడే మైదానాలు, చెరువులు, కుంటలు, దేవాలయాల స్థలాలు చదును చేయడం, చెత్తాచెదారం తొలగింపు, రహదారులపై గుంతలు పూడ్చడం, బతుకమ్మ విగ్రహాలకు రంగులు వేయడం తదితర పనులకు సుమారు రూ.65 లక్షలు కేటాయించారు. బతుకమ్మ, దసరా ఉత్సవాలు, రావణ వధ జరిగే మైదానాలు దగ్గర విద్యుద్దీపాల కోసం రూ.30-35 లక్షలు కేటాయించారు. బల్దియా సాధారణ నిధుల(జనరల్ ఫండ్స్) నుంచి సుమారు రూ.కోటి వరకు ఖర్చు చేసేందుకు నిర్ణయించారు. మొక్కుబడి ఏర్పాట్లతో తిప్పలు తప్పేలా లేవు.

– న్యూస్‌టుడే, కార్పొరేషన్

పరిశీలన

పోతన మందిరం వద్ద

సద్దుల బతుకమ్మ రోజున మహిళలు పెద్దసంఖ్యలో పోతన మందిరం, పోతన విజ్ఞానపీఠం, పోతనరోడ్‌కు వస్తారు. గతేడాది విద్యుద్దీపాలు సరిగా లేకపోవడం, బతుకమ్మలు నిమజ్జనం చేసేందుకు తాత్కాలిక వాటర్ పాండ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి పోతననగర్ వద్ద బతుకమ్మ ఏర్పాట్ల కోసం రూ.4.29 లక్షలు కేటాయించారు. ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఏర్పాట్లు మొదలు కాలేదు. పోతన మందిరం లోపల, బయట అపరిశుభ్రత నెలకొంది. పోతనరోడ్ మలుపు ప్రమాదకరంగా ఉంది. గతేడాది ఇక్కడ ఇద్దరు మహిళలు ప్రమాదానికి గురయ్యారు. ఈసారైనా పటిష్ఠ చర్యలు తీసుకోవాలి.



వరంగల్ పోతన మందిరంలో అసంపూర్తిగా పనులు

ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో..



ఎత్తు వంపులుగా..

కరీమాబాద్: అండర్ రైల్వేగేటు ప్రాంతంలో ఉర్సుగుట్ట రంగలీలా మైదానం, రంగసముద్రం చెరువు సమీపంలో వైభవంగా సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు జరుగుతాయి. ఏర్పాట్ల కోసం బల్దియా అధికారులు రూ.15 లక్షల నిధులు కేటాయించారు. సద్దుల బతుకమ్మ సంబరాలకు మూడురోజులు, దసరా వేడుకలకు అయిదురోజుల సమయం ఉంది. అయినా ఏర్పాట్లు నత్తనడకన సాగుతున్నాయి. మైదానమంతా గుంతలమయంగా ఉంది. కొన్నిచోట్ల కంకర తేలి, నడవడానికి, నిలబడేందుకు వీల్లేకుండా ఉంది. కోతకు గురైన రోడ్లను బాగు చేయలేదు. బతుకమ్మ నిమజ్జనం కోసం ఉర్సు రంగ సముద్రం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులు మొక్కుబడిగానే చేపట్టారు.

చెరువును పూడ్చుతారా?

కాశీబుగ్గ: కాశీబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువులో దసరా ఉత్సవాలు జరిపేందుకు మట్టి పోసి చదును చేస్తున్నారు. ఇన్నాళ్లు అజంజాహి మైదానంలో కాశీబుగ్గ దసరా ఉత్సవ సమితి రావణ వధ నిర్వహించేవారు. గతేడాది రావణ వధను ఓసిటీ వాసులు వ్యతిరేకించడంతో చిన్నవడ్డేపల్లి చెరువులో ఉత్సవాలు చేశారు. అప్పుడు కూడా చెరువులో మట్టి పోసి చదును చేశారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరిట చెరువుల రక్షణకు చర్యలు తీసుకుంటుంటే.. ఇక్కడ పూడ్చడంపై విమర్శలొస్తున్నాయి.



కాశీబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువులో మట్టిపోసి చదును చేశారిలా..

చెత్తకుప్పలు.. విద్యుత్తు స్తంభాలు

శివనగర్: శివనగర్ బతుకమ్మ స్థలంలో జరిగే వేడుకల్లో 34, 35, 36వ డివిజన్లకు చెందిన మహిళలు పాల్గొంటారు. ఇదే స్థలంలో దసరా ఉత్సవాలు నిర్వహించడానికి బల్దియా అధికారులు సుమారు రూ.4.20 లక్షలు కేటాయించారు. ప్రస్తుతానికి మైదానం చదును చేశారు. బతుకమ్మలను నిమజ్జనం చేసే చెరువులోని గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించలేదు. మైదానంలో మట్టిపోసి చదును చేసినా.. సమాంతరంగా లేదు. బతుకమ్మ ఆట స్థలంలోకి వెళ్లడానికి ముందు దారిలో విద్యుత్తు స్తంభాలున్నాయి. చెత్త కుప్పలు అలాగే ఉన్నాయి.



శివనగర్ బతుకమ్మ ఆట స్థలంలోకి వెళ్లే మార్గం..



బతుకమ్మ కుంటలో పూర్తిస్థాయిలో తొలగించని గుర్రపుడెక్క

కళతప్పిన విగ్రహం



దేశాయిపేట, కొత్తవాడ: దేశాయిపేట చిన్నవడ్డేపల్లి చెరువులో గుర్రపు డెక్కను ఒక వైపు పూర్తిగా తొలగించారు. మరో వైపు పనులు జరుగుతున్నాయి. గతేడాది చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలోని సీకేఎం కళాశాల మైదానంలో సరిపడా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు ఇబ్బందిపడ్డారు. కొత్తవాడ తోట మైదానంలో బతుకమ్మ విగ్రహానికి రంగులు వేయకపోవడంతో కళ తప్పింది. అక్కడక్కడ పోసిన మట్టి కుప్పలను చదును చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయిస్తాం

- రాజయ్య, ఎస్‌ఈ, గ్రేటర్ వరంగల్

వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో సద్దుల బతుకమ్మ పండుగ కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఎక్కడైనా పనులు కాకపోతే పరిశీలించి పూర్తి చేయిస్తాం. మహిళలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

రాకపోకలకు వంతెన.. నీటి నిల్వకు చెక్‌డ్యామ్



కల్లెడ, రావూర్ గ్రామాల మధ్య నిర్మించిన చెక్‌డ్యామ్ వంతెన



నిలిచిన నీరు

నీటినిల్వతో పాటు రాకపోకలు సాగించేందుకు వీలుగా ఓరుగల్లు జిల్లాలో తొలిసారి నిర్మించిన వంతెన- చెక్‌డ్యామ్ (బ్రిడ్జి కం చెక్‌డ్యామ్) సత్ఫలితాన్నిస్తోంది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ, రావూర్ గ్రామాల మధ్య ఆకేరు వాగుపై రాష్ట్రంలోనే తొలిసారిగా నాలుగేళ్ల క్రితం రూ.8.50 కోట్ల నిధులతో ఈ ప్రాజెక్టు చేపట్టారు. దీంతో సుమారు 1.5 కిలోమీటర్ల మేర నీళ్లు నిలిచి భూగర్భజలాలు వృద్ధి చెందుతున్నాయి. గతంలో వాగుపై చెక్‌డ్యామ్‌లు లేకపోవడంతో భారీ వర్షాలు కురిసినా.. చుక్క నీరు నిల్వ ఉండేది కాదు. యాసంగి సాగుకు రైతులు ఇబ్బంది పడేవారు. వారి కష్టాలను తీర్చడానికి తొలుత చెక్‌డ్యామ్ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదించారు. దీంతో పాటు వంతెన నిర్మిస్తే రెండు గ్రామాలకు దాదాపు 2 కి.మీ. మేర దూరభారం తగ్గుతుందని ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టు చేపట్టారు. 120 మీటర్ల పొడవు 10 మీటర్ల ఎత్తుతో వంతెన నిర్మించి అందులో 3.8 మీటర్ల ఎత్తులో చెక్‌డ్యామ్ కట్టారు. దీనివల్ల దాదాపు 1.5 కి.మీ. మేర ఆకేరు వాగు ఇరువైపులా ఉన్న సుమారు 300 ఎకరాలకు రెండు పంటలకు నీరందుతోంది. దీనికితోడు పర్వతగిరి నుంచి తొర్రూరు పట్టణానికి వెళ్లే ప్రజలకు అయిదు గ్రామాలకు, పర్వతగిరి మండలం నుంచి వర్ధన్నపేట మార్గంలో నాలుగు గ్రామాల ప్రజలకు రెండు కిలో మీటర్ల దూరభారం తగ్గింది.

– న్యూస్‌టుడే, పర్వతగిరి(వర్ధన్నపేట)

ఏడుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ



వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని వివిధ ఠాణాల్లో పనిచేస్తున్న ఏడుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇంతేజార్‌గంజ్ నుంచి బదిలీ అయినా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. పది రోజుల క్రితం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యను ఐజీకి అటాచ్ చేశారు. అక్కడ కూడా ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వలేదు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీస్థానం
ఎ.మహేందర్	సీసీఎస్	గీసుగొండ
జి.బాబులాల్	గీసుగొండ	టాస్క్‌ఫోర్స్
ఎస్.రవికుమార్	టాస్క్‌ఫోర్స్	కేయూసీ
బి.సంజీవ్	కేయూసీ	ఎస్‌బీ వరంగల్
ఒ.రమేష్	సీసీఎస్	మామునూరు
ఎం.రవికుమార్	మామునూరు	ఐజీ అటాచ్
ఎం.శివకుమార్	ఇంతేజార్‌గంజ్	సీసీఎస్

పండగ వేళ.. ట్రాఫిక్ పద్మవ్యూహం

● సిబ్బంది లేక ఇబ్బందులు



కాజీపేట బ్రిడ్జి వద్ద వాహనాల రద్దీ.. ఇక్కడ రైల్వే వంతెన ఒకటే ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. అసంపూర్తిగా ఉన్న మరో రైల్వే వంతెన పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలు, దసరా పండగను పురస్కరించుకొని వరంగల్ నగరంలో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరిగింది. పండగ సామగ్రి, దుస్తుల కొనుగోళ్లకు ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి తరలివస్తున్న ప్రజలతో మార్కెట్ రోడ్లన్నీ కిక్కిరిసిపోతున్నాయి. కాజీపేట నుంచి వరంగల్, కరీంనగర్ రహదారిలో వాహనాల సంఖ్య అధికంగా ఉంటోంది. దీంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు నెలకొంటున్నాయి. పండగ రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు, నగరవాసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం..

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే

● ప్రతినెలా 4 వేల వరకు కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి.

ఇదీ పరిష్కారం..

● రోడ్లు ఇరుకుగా ఉండి జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వన్‌వేలను ఏర్పాటు చేయాలి.

● సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఉండేలా చర్యలు తీసుకోవాలి.

● ఉదయం, సాయంత్రం కళాశాలలు, పాఠశాలల సమయంలో అదనంగా సిబ్బందిని నియమించి ట్రాఫిక్‌ను నియంత్రించాలి.

● రద్దీని బట్టి ట్రాఫిక్ కూడళ్ల వద్ద అదనంగా సిబ్బందిని కేటాయించాలి.

రోడ్లపై 2 లక్షలకు పైగా వాహనాలు..

● పోలీసు శాఖ లెక్కల ప్రకారం కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో రెండు, నాలుగు చక్రాలు, భారీ వాహనాలు కలిపి సుమారు 4.50 లక్షల వరకు ఉంటాయి. ప్రతి రోజు ఇతర ప్రాంతాల నుంచి లక్ష వరకు వాహనాలు నగరానికి వచ్చి వెళ్తుంటాయి. అన్ని కలిపి నగరంలో రోజుకు 2 లక్షలకు పైగా వాహనాలు తిరుగుతుంటాయని పోలీసుల అంచనా. పండగల వేళ మరో 20 వేలు అధికంగా తిరుగుతుంటాయి.

ట్రాఫిక్ ఉల్లంఘనలపై చలాన్లు ఇలా..

నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణా పరిధిలో ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు విధించిన ట్రాఫిక్ చలాన్లు కేసుల నమోదు

ఉల్లంఘనలు	కేసుల సంఖ్య	జరిమానా (రూ.లలో)
హెల్మెట్ లేకుండా చలాన్లు	2,56,767	4,24,71,300
రాంగ్ రూట్ డ్రైవింగ్	11,531	22,92,400
ట్రిపుల్ రైడింగ్	10,261	1,19,91,600
చరవాణి మాట్లాడుతూ డ్రైవింగ్	6004	59,58,000



తిరుమల జంక్షన్‌లో..

ఇదీ పరిస్థితి..

పెరిగిన ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రస్తుతం నగరంలోని మూడు ట్రాఫిక్ ఠాణాలోని సిబ్బంది సరిపోవడం లేదు. ఏఆర్ విభాగం నుంచి కొందరిని కేటాయించారు. అయినప్పటికీ కాజీపేట ఫాతిమా నగర్ బ్రిడ్జి, పెట్రోల్‌పంపు, లష్కర్‌బజార్, హనుమకొండ చౌరస్తా, ఎన్జీవోస్ కాలనీ రోడ్డు, నయీంనగర్, వరంగల్ పోచమ్మ మైదానం, వరంగల్ చౌరస్తా, హెడ్ పోస్టాఫీస్, ఎస్వీఎన్ రోడ్డు ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో పాటుగా రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

● పదేళ్లలో నగరంలో వాహనాల సంఖ్య వంద శాతం పెరిగింది. ఆ స్థాయిలో రహదారుల విస్తరణ జరగలేదు. దీంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటుంది. పండగల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం సిబ్బందిని పెంచాలి.



వరంగల్ చౌరస్తా నుంచి బట్టల బజార్ రోడ్డు..



వరంగల్ చౌరస్తాలో అన్ని వైపులకు ఒకరే ట్రాఫిక్ పోలీసు..

సిబ్బంది సంఖ్య పెరగాలి..

ప్రస్తుతం వరంగల్ కమిషనరేట్ పరిధిలో 14 నుంచి 16 కిలో మీటర్ల వరకు ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. ఇన్ని కిలోమీటర్ల దూరం ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలంటే సుమారు 400లకు పైగా సిబ్బంది అవసరం.

● ప్రస్తుతం 140 మంది ట్రాఫిక్ సిబ్బంది, 100 మంది హోంగార్డులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కంటే ట్రాఫిక్ నియంత్రణ పాయింట్లు పెరిగాయి. నగర శివారులతో కలిపి మొత్తం 51 ట్రాఫిక్ పాయింట్లు, 11 సిగ్నల్స్ ఉన్నాయి.

● నగరంలో మూడు ట్రాఫిక్ ఠాణాలు మాత్రమే ఉన్నాయి. మరో మూడు అవసరం ఉంది.

పార్కింగ్‌తో సమస్య..

నగరంలో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వచ్చాయి. వీటిలో షాపింగ్ చేసేందుకు వచ్చే ప్రజలు వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నారు.

ఇలా చేద్దాం: షాపింగ్ మాల్స్ ఆవరణలోని సెల్లార్లల్లో వాహనాలను పార్కింగ్ చేయాలి.

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి. రాంగ్ రూట్‌లో రావడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీని వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

● వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ఇబ్బందులు ఉండవని ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు.

మహాలక్ష్మీ.. కరుణించు తల్లీ!



రంగంపేట, న్యూస్‌టుడే: సిరి సంపదలివ్వమ్మా శ్రీమహాలక్ష్మీ అంటూ భక్తులు వేడుకున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజు ఆదివారం భద్రకాళి అమ్మవారు మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నిత్యాహ్నికం, సాయంత్రం గిరిజా దుర్గార్చన పూజారాధనలు జరిపారు. ఉదయం 11 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం హంస వాహన సేవలు నిర్వహించారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్య తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అందరూ ముఖ్యులే.. సాధారణ భక్తులకు అవస్థలు!



అమ్మవారి దర్శనానికి వరుసలో ఉన్న సాధారణ భక్తులు



వీఐపీ ద్వారం వద్ద రద్దీ

రంగంపేట, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భక్తులు భద్రకాళి ఆలయానికి పోటెత్తుతున్నారు. రద్దీకి అనుగుణంగా దేవస్థానం అధికారులు, ఉద్యోగులు తగిన ఏర్పాట్లు చేయడం లేదు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో దాదాపు 2-3 గంటల పాటు అన్ని క్యూలైన్లలో సాధారణ భక్తులు బారులుతీరారు. వీళ్లను అలాగే వదిలేసి వీఐపీ(అత్యంత ముఖ్యమైన వ్యక్తి) ద్వారంలో నుంచి వందలాది మందిని ఒకేసారి లోనికి పంపించడంతో గందరగోళం నెలకొంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు, అర్చకులు బంధువులు, స్నేహితులను వీఐపీ మార్గం గుండా తీసుకెళ్లారు. గంటల తరబడి సాధారణ భక్తులు క్యూలైన్లలో విలవిల్లాడారు. తాగునీటి కోసం అల్లాడారు. రద్దీని కట్టడి చేసేందుకు వెళ్లిన ఈవో శేషభారతి సైతం అందులో ఇరుక్కుపోయారు. సాధారణ భక్తులను వదిలేసి వీఐపీ మార్గానికే ప్రాధాన్యం ఇచ్చారని భక్తులు నిలదీశారు.

ప్రైవేటు పెత్తనం..: భద్రకాళి ఆలయంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పేరుతో పలువురు.. మాజీ ధర్మకర్తలు, దాతల పేరుతో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తున్నారు. వీఐపీ క్యూలైన్ వద్ద వారిదే హవా నడుస్తోంది. కొందరు అర్చకులు సైతం అతిగా వ్యవహరిస్తున్నారు. అడ్డదారిలో భక్తులను గర్భాలయంలోకి తీసుకెళ్తున్నారు.

తెల్లబంగారం.. అన్నింటికీ ఆధారం

నేడు ప్రపంచ పత్తి దినోత్సవం

పత్తి ప్రాధాన్యం.. ప్రాముఖ్యాన్ని గుర్తించడంతో పాటు పత్తిపై అవగాహన పెంచేందుకు, సాగును ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏటా అక్టోబరు 7న ప్రపంచ పత్తి దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది పత్తి దినోత్సవం ఉద్దేశం 'కాటన్ ఫర్ గుడ్'. దీనిని ప్రపంచ వాణిజ్య సంస్థ, యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్, ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ సంయుక్తంగా నిర్ణయించారు.

ఉమ్మడి వరంగల్‌వ్యాప్తంగా రైతులు పండించే ప్రధాన పంట పత్తి.. ఇది వారికి ముఖ్యమైన ఆదాయ వనరు. సోమవారం ప్రపంచ పత్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పంట ప్రధాన్యం, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 5,13,289 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా.. 4,10,632 మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

ఎనుమాముల మార్కెట్, న్యూస్‌టుడే



మీకు తెలుసా..

● ప్రపంచ దేశాలతో పోలిస్తే మనదేశం 40 శాతం తెల్లబంగారాన్ని పండిస్తోంది.

● ప్రపంచ వ్యాప్తంగా పత్తిని వాణిజ్య పంటగానే కాకుండా ఆహార, చమురు పంటగా గుర్తిస్తున్నారు. పత్తి గింజలను వంట నూనెగా, గింజల చెక్కను పశు దాణాగా వాడుతున్నారు. కొన్ని దేశాల్లో గింజల నూనెను జీవ ఇంధనం తయారీకి వినియోగిస్తున్నారు.

● పత్తి తన సొంత బరువు కన్నా 27 రెట్లు నీటిని గ్రహించగలదు. దాంతో కావాల్సిన సాంద్రతతో వస్త్రాలను నేయవచ్చు. నాణ్యత కాటన్ ఫ్యాబ్రిక్‌కు సులభంగా రంగులు వేసేందుకు వీలుగా ఉంటుంది.

● ఓ జీన్స్ తయారీకి 0.68 కిలోలు, చొక్కాకు 0.28 కిలోలు, టీషర్టుకి 0.23 కిలోలు, డైపర్ తయారీకి 0.07 కిలోలు, టవల్‌కు 0.28 కిలోలు పత్తి అవసరమని అంచనా.

ఏడాది పొడవునా ఉపాధి..

అంతర్జాతీయ పత్తి సలహా కమిటీ(ఐసీఏసీ) అంచనా ప్రకారం.. రైతు పండించిన ఓ టన్ను పత్తి అయిదుగురికి ఏడాది పొడవునా ఉపాధి కల్పిస్తోంది. వైద్య రంగం, పశుగ్రాసం, వంటనూనె పరిశ్రమలతో పాటు వస్త్ర పరిశ్రమలకు ఇది ముడి సరకు. వ్యవసాయం, తయారీ, రిటైల్ రంగాల్లో ఉద్యోగాలను సృష్టిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా 20 వేల మందికి పైగా పత్తి పరిశ్రమ ఉపాధి కల్పిస్తుంది. రైతులు, కూలీలతో పాటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు, ఫిట్టర్లు, ప్రెస్సింగ్, జిన్నింగ్ ఆపరేటర్లు, హమాలీలు, మార్కెటింగ్‌శాఖ, వస్త్ర పరిశ్రమ, తదితర అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న వారికి ఉపాధి లభిస్తోంది.

● ఉమ్మడి జిల్లాలో మొత్తం 55 జిన్నింగ్ మిల్లులుండగా.. ఒక్కో మిల్లులో సుమారు 150 మంది పనిచేస్తూ.. తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.



హనుమకొండ జిల్లా ఆత్మకూరులో పత్తి తీస్తున్న మహిళా కూలీ (పాతచిత్రం)

వివిధ ప్రాంతాలకు ఎగుమతి..

ఉమ్మడి వరంగల్‌లో పండిన పత్తిని వ్యాపారులు వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడి నుంచి స్పిన్నింగ్ చేసిన దూది బేళ్లు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, వియత్నాం, చైనా దేశాలకు ఎగుమతి అవుతుంది. పత్తి నుంచి వేరుచేసిన గింజలను వంట నూనె, పశువుల దాణా తయారీ కోసం హరియాణా, పంజాబ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు.

రంగురంగుల్లో.. పంట

పత్తి అనగానే మనకు తెల్లని దూది మాత్రమే స్ఫురిస్తుంది. ఆ దూదిని రంగురంగుల్లో పండించేందుకు పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు. నాగపూర్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రిసెర్చ్ సంస్థ, దార్వాడలోని అగ్రికల్చరల్ సైన్సెస్ యూనివర్సిటీలకు చెందిన నిపుణులు రంగుల పత్తి వంగడాలను సృష్టించి, ఏడేళ్లుగా వివిధ ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా పండిస్తున్నారు. సహజసిద్ధంగా పత్తికి రంగు రావడంతో.. అదనంగా పత్తి దారాలకు రంగు నీళ్లలో ముంచాల్సిన అవసరం ఉండదు. దాంతో జల కాలుష్యాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.



పత్తి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలి

- బొమ్మినేని రవీందర్‌రెడ్డి, పత్తి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రంలో పత్తి ఆధారిత, అనుబంధ పరిశ్రమలు లేకపోవడంతో ఇక్కడ పండిన దిగుబడులు ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. పరిశ్రమల ఏర్పాటుతో ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు రవాణా భారం తగ్గుతుంది. యూరియా సంచుల్లో రైతులు పత్తిని తీసుకురావడం వల్ల తెల్లని ప్లాస్టిక్ వ్యర్థాలు పత్తిలో కలిసిపోతున్నాయి. స్పిన్నింగ్ మిల్లులు అలాంటి పత్తిని తిరస్కరిస్తున్నాయి. ప్రభుత్వం యూరియా బస్తాల రంగును మార్చడం ద్వారా ఈ సమస్య పరిష్కరించవచ్చు.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది వివరాలు

● పత్తి సాగు (ఎకరాల్లో) ● దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	పత్తి సాగు (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నుల్లో)
వరంగల్	1,20,037	96,030
హనుమకొండ	77,330	61,864
ములుగు	21,114	16,891
జనగామ	1,25,195	1,00,156
భూపాలపల్లి	91,281	73,025
మహబూబాబాద్	78,332	62,666

నేడు, రేపు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: 10వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర, హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి తెలిపారు. అండర్-14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలు, 10 క్రీడా పాఠశాలల నుంచి అథ్లెట్లు హాజరవుతారన్నారు. ముఖ్య అతిథిగా పారా ఒలింపియన్ జీవాంజి దీప్తి, ఇతర జాతీయస్థాయి అథ్లెట్లు, ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేశ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.



సాధించిన పతకంతో సుకన్య

పవర్ లిఫ్టింగ్‌లో రజత పతకం

సీరోలు(కురవి), న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం రేకుల తండా గ్రామపంచాయతీ శివారు జగ్యాతండాకు చెందిన తేజావత్ సుకన్య కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ పోటీల్లో రజత పతకం సాధించారు. మారుమూల గిరిజన తండాలోని మధ్య తరగతి గిరిజన కుటుంబంలో జన్మించిన ఆమె క్రీడల్లో రాణించాలనే తపనతో ముందుకు సాగుతున్నారు. డిగ్రీ వరకు చదువుకున్న ఆమె తొలుతగా వెయిట్ లిఫ్టింగ్‌తో ప్రారంభించి అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు పొందారు. 2024 జూన్‌లో దక్షిణ ఆఫ్రికా దేశంలో పవర్‌లిఫ్టింగ్‌లో రాణించి పతకం సాధించారు. ఈనెల 4 నుంచి దక్షణాఫ్రికా దేశంలోని సన్‌సిటీలో జరుగుతున్న పోటీల్లో శనివారం రాత్రి జరిగిన బాలికల విభాగం పవర్‌లిఫ్టింగ్‌లో 76 కిలోల బరువు ఎత్తి రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నారు. తండ్రి లక్ష్మణ్ ఇల్లందులో సింగరేణి ఉద్యోగం చేస్తున్న క్రమంలో తల్లిదండ్రులతో కలిసి రోజు ఉదయం వాకింగ్‌కు వెళ్లేవారు. అక్కడ కొంత మంది వెయిట్‌లిఫ్టింగ్ సాధన చేస్తుండగా వారితోపాటు సుకన్య చేసేవారు. ఆసక్తి పెరగడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లి శిక్షణ పొంది జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో బంగారు, వెండి పతకాలు సాధించారు. దక్షిణ ఆఫ్రికాకు వెళ్లేందుకు సహకరించిన గ్రీన్‌కో సంస్థ గ్రూపు ఛైర్మన్ అనీల్‌కుమార్‌శెట్టికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పిడుగుపాటుతో ఒకరికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఆర్.సింగారం రఘు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: పిడుగుపడి ప్రైవేటు కంపెనీలోని ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని నర్సింహులగూడెంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజదాని అమరావతి వరకు గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. నిర్మాణ సామగ్రి సంబంధిత ఉద్యోగులు, సిబ్బంది నివాసం కోసం ఆలేరు, నర్సింహులగూడెం గ్రామాల పరిధిలో క్యాంప్ ఏర్పాటు చేశారు. తమిళనాడు రాష్ట్రం వెళ్లూరు జిల్లా తిరుపత్తూరు, పెరియార్‌కొట్టం ప్రాంతానికి చెందిన ఇంజినీరు ఆర్. సింగారం రఘు మూడు నెలల నుంచి పనిచేస్తున్నారు. ఆదివారం క్యాంప్ కార్యాలయం ఆరుబయట చరవాణిలో మాట్లాడుతున్నారు. అకస్మాత్తుగా పిడుగు పడటంతో ఆయన తీవ్రంగా గాయపడగా అక్కడ ఉన్న వారు సీపీఆర్ చేసి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

తెలంగాణ ఉద్యమ చరిత్రను రికార్డు చేయాలి



సదస్సులో ప్రసంగిస్తున్న కోదండరాం, వేదికపై అంబటి శ్రీనివాస్, కేయూ ప్రొఫెసర్ వెంకటనారాయణ తదితరులు

నర్సంపేట, న్యూస్‌టుడే: భావితరాలకు తెలిసేలా తెలంగాణ ఉద్యమాన్ని రికార్డు చేయాలని ఎమ్మెల్సీ, తెజస వ్యవస్థాపక అధ్యక్షుడు కోదండరాం ప్రభుత్వాన్ని కోరారు. ఈ చరిత్రను మరుగున పడేసేందుకు కొందరు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. తెలంగాణ ఐకాస నర్సంపేట డివిజన్ కమిటీ, తెజస ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లా నర్సంపేటలో వేడుకల మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి తెలంగాణ ఉద్యమకారుల సదస్సులో కోదండరాం మాట్లాడారు. స్వయంపాలన కోసం అరవై ఏళ్లుగా ఎన్నో సంఘాలు, ఎందరో చేసిన పోరాటం, 1200 మంది ప్రాణత్యాగాలతో ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా నిర్బంధాలు, ఫోన్‌ట్యాపింగ్, అక్రమ అరెస్టులు లేవని, ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి పాటుపడదామన్నారు. అమరుల కుటుంబాలకు పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గుర్తింపు కార్డులిచ్చి వారి సంక్షేమానికి కృషి చేయాలన్నారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద కోదండరాంకు స్థానికులు స్వాగతం పలికారు. అమరవీరుల స్తూపం, చాకలి ఐలమ్మ, అంబేడ్కర్, వడ్డెర జాతి నాయకుడు ఓబలన్న విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెజస రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ రెండు నెలల్లో తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించకపోతే మరో ఉద్యమం తప్పదన్నారు. కేయూ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ప్రసంగిస్తూ గత పదేళ్లలో తెలంగాణ వనరులను దోపిడీ చేసిన దొంగలు పది నెలల్లో ఏదో జరిగినట్లు రచ్చ చేస్తున్నారన్నారు. ఈ సర్కార్‌ను కాపాడుకోవాలన్నారు. కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సదస్సులో నిట్ ప్రొఫెసర్ రమ, ఉద్యమకారులు, ప్రజా సంఘాల, ఐకాస నాయకులు రామ్మూర్తి, జావిద్, అరుణ, ఖాలీ సయ్యద్, అరుణ, డాక్టర్ జగదీశ్వర్, రమాదేవి పాల్గొన్నారు. వివిధ సంఘాల నాయకులు కోదండరాంకు వినతి పత్రాలు సమర్పించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

బతుకమ్మ వేడుకలకు రూ.21 లక్షలతో ఏర్పాట్లు


నర్సంపేట వల్లబ్‌నగర్‌లో బతుకమ్మ మైదానాన్ని చదును చేస్తున్న ట్రాక్టర్

నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేటలో సద్దుల బతుకమ్మ, దసరా వేడుకలకు రూ. 21.89 లక్షలతో ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణంలోని అంగడి మైదానం, వల్లబ్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, సర్వాపురంలోని పసునూరు కాలువ, ద్వారకపేటలోని వేణుగోపాల, వేంకటేశ్వరస్వామి ఆలయం, కాకతీయనగర్, కమలాపురంలోని మాధన్నపేట చెరువు కట్టపై బతుకమ్మ ఆడతారు. ఈ ప్రాంతాల్లో మైదానాల చదును, విద్యుత్తు దీపాల అలంకరణ, సౌండ్ సిస్టమ్స్ తదితర పనులు చేస్తున్నారు. అంగడి మైదానంలో పెద్ద కాలువ, మాధన్నపేట చెరువు, పసునూరు కాలువ, కాకతీయనగర్‌లో వాగు వద్ద నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో కర్రలతో బారికేడ్లు ఏర్పాటు చేయాలి.

పోరాట యోధుడు సారంగపాణి


జోహార్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ప్రజా, కార్మికవర్గ పోరాటాలకు నాయకత్వం వహించి, అన్నివర్గాల ప్రజలను ఐక్యం చేసిన నాయకుడిగా పేరున్న సారంగపాణి ఆశయాలను కొనసాగించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.రాములు పేర్కొన్నారు. ఆదివారం ఖిలా వరంగల్ పడమరకోటలో సీపీఎం నాయకుడు సుతారి సారంగపాణి సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిల్లుల్లో గుమాస్తాగా పనిచేసిన ఆయన నగరంలోని కార్మికుల పక్షాన ఉద్యమ పోరాటాలు చేశారన్నారు. నాయకులు వాసుదేవరెడ్డి, రంగయ్య, నలిగంటి రత్నమాల, పల్లం రవి, గడ్డం రమేశ్, సాగర్ల శ్రీనివాస్, కార్పొరేటర్ బైరబోయిన ఉమ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశస్తమైన ఆలోచన!


వరంగల్ కృష్ణా కాలనీలో విద్యార్థి వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు రమేశ్

విద్యార్థుల్లో వైకల్యం గుర్తించేందుకు ప్రత్యేక యాప్


న్యూస్‌టుడే, వరంగల్ కలెక్టరేట్

ప్రత్యేక అవసరాలు ఉన్న (దివ్యాంగ) పిల్లల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను ప్రవేశపెడుతున్నాయి. వారికి సంబంధించిన సమగ్ర వివరాలు ప్రభుత్వాల వద్ద అందుబాటులో లేకపోవడంతో.. దివ్యాంగ పిల్లలకు పూర్తి స్థాయిలో సంక్షేమ ఫలాలు అందడం లేదు. ఈ నేపథ్యంలో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) పాఠశాల స్థాయిలో చదువుకుంటున్న విద్యార్థుల్లోని వైకల్యం గుర్తించేందుకు ప్రత్యేకంగా 'ప్రశస్త్' యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను ప్రభుత్వ ఉపాధ్యాయులతోపాటు సమ్మిళిత విద్య రిసోర్స్ పర్సన్స్ (ఐఈఆర్‌పీ)లు డౌన్‌లోడ్ చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులందరినీ పరిశీలించి వారిలో ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించాలని మార్గనిర్దేశకాలు రూపొందించింది. ఇప్పటికే యాప్ వినియోగంపై సమగ్ర శిక్ష రిసోర్స్ పర్సన్‌లు పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

జిల్లాలో పాఠశాలలు	సంఖ్య	విద్యార్థులు
ప్రభుత్వ	724	46,508
ప్రైవేట్ బడులు	235	50,565
ఆదర్శ పాఠశాలలు	06	2,462
కేజీబీవీ	10	3,566

21 రకాల వైకల్యాలను గుర్తించేలా 63 ప్రశ్నలు

దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం.. విద్యార్థుల్లో 21 రకాల వైకల్యాలను గుర్తించేందుకు ప్రశస్త్ యాప్‌లో 63 ప్రశ్నలు పొందుపరిచారు. మొదటి దశలో సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ వారిలోని అవయవ లోపం, వినికిడి, మాట్లాడే తీరు, మనోవైకల్యం తదితర లోపాలను ప్రశ్నల ద్వారా నిశితంగా పరిశీలించి.. యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. మొదటి దశలో ఏ ఒక్క ప్రశ్నకు 'అవును' అనే సమాధానం వచ్చినా.. ఆ విద్యార్థిని రిసోర్స్ పర్సన్లు రెండో దశలో పరిశీలిస్తారు. అనంతరం వారి తల్లిదండ్రుల అనుమతితో.. పూర్తి స్థాయి వైద్య పరీక్షల కోసం వైద్యుడికి సిఫార్సు చేస్తారు. వైద్యుడి కౌన్సెలింగ్, పరిశీలన అనంతరం ఆయన నిర్ధారణ మేరకు వైకల్య ధ్రువీకరణ పత్రం జారీతోపాటు విద్యాబోధనలో ఆ విద్యార్థిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలని ఉపాధ్యాయులకు సూచిస్తారు. ప్రశ్నలకు సమాధానాలను రాబట్టే సమయంలో పిల్లల మనోభావాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్‌సీఈఆర్‌టీ సూచించింది. తొలుత సెప్టెంబరు 23 నుంచి 25 వరకు ఈ యాప్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. సెప్టెంబరు 26 నుంచి అక్టోబరు 26 వరకు ఉపాధ్యాయులు విద్యార్థుల మొదటి దశ పరిశీలన చేపట్టనున్నారు. రెండో దశను అక్టోబర్ 27 నుంచి నవంబరు 14 వరకు చేపడతారు.



యాప్

పకడ్బందీగా నమోదుచేయాలి

కుడికాల సుభాష్, సీఎంవో, సమగ్ర శిక్ష, వరంగల్

ప్రశస్త్ యాప్ నిర్వహణపై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తయింది. ఉపాధ్యాయులు విద్యార్థులతో మాట్లాడుతూ. . వారిలోని వైకల్యాలను ప్రాథమికంగా గుర్తించి యాప్‌లో నమోదు చేస్తారు. ప్రాథమిక దశలోనే విద్యార్థుల్లోని వైకల్యాలను గుర్తించడం ద్వారా. సరైన వైద్య సాయంతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తవు.

మేమున్నాం.. మీకు తోడుగా నర్సంపేట: 99635 59929 కార్పొరేషన్: 98484 09191 వర్ధన్నపేట: 99896 42307 వరంగల్ ఈస్ట్: 97053 46535 (10 AM TO 1 PM)

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలా వరంగల్ తూర్పుకోటలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి. మైదానంలో ముళ్ల పొదలు, చెత్తను తొలగించాలి. - శ్రీనివాస్ స్థానికులు

సమాధానం: రెండు రోజుల్లో పనులు ప్రారంభించి శుభ్రం చేస్తాం. - బోగి సువర్ణ, 37వ డివిజన్ కార్పొరేటర్

సమస్య: ఖిలావరంగల్ పడమరకోట శ్రీస్వయంభు శంభు లింగేశ్వరస్వామి దేవాలయం వద్ద గుంతలు పూడ్చేలా చూడగలరు. ఆలయ పరిసరాల్లో శుభ్రం చేయాలి. - మల్లికార్జున్ స్థానికులు

సమాధానం: రెండురోజుల్లో పనులు చేపడతాం. - బైరబోయిన ఉమ, 38వ డివిజన్ కార్పొరేటర్

రోడ్డుపై కల్లం.. రాకపోకలు కష్టం



ఖిలావరంగల్‌కోట ప్రధాన రహదారి కల్లంగా మారిపోయింది. స్థానిక రైతులు తాము పండించిన పంట దిగుబడులు ఆరబోసుకునేందుకు ప్రత్యేకంగా కల్లాలు లేకపోవడంతో రోడ్డును ఉపయోగించుకుంటున్నారు. రైతులు తేమను తగ్గించేందుకు ఆదివారం ఇలా మొక్కజొన్న గింజలను నేర్పుతూ కనిపించారు. – న్యూస్‌టుడే, ఖిలావరంగల్


చెన్నారావుపేటలో మహాలక్ష్మి అవతారంలో..


రాధిక థియేటర్ వీధిలో కలకత్తా కాళీ రూపంలో అమ్మవారు


గిర్మాజీపేటలో శ్రీచక్ర యాగ్ అధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేటకు చెందిన కళాకారుల ప్రదర్శన


తిమ్మంపేటలో లలిత త్రిపుర సుందరీదేవి అవతారంలో..


పర్వతగిరి మండలం కల్లెడలో


నల్లబెల్లిలో లలిత త్రిపుర సుందరీదేవిగా..

భవానీ నమోస్తుతే..!


గీసుకొండ మండలం ధర్మారంలో అన్నపూర్ణాదేవి అవతారంలో..

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. వరంగల్ ఎంజీఎం కూడలిలోని శ్రీరాజరాజేశ్వరీదేవి ఆదివారం నాలుగో రోజు త్రిమూర్తిగా దర్శనమిచ్చారు. - న్యూస్‌టుడే, జిల్లా యంత్రాంగం


వివేకానంద కాలనీలో..


హనుమాండ్ల వీధి అమ్మవారి వద్ద భక్తులు


ఖానాపురంలో..


గిర్మాజీపేటలో లక్ష్మీరూపంలో


ఎంజీఎం కూడలిలో త్రిమూర్తి అలంకరణలో రాజరాజేశ్వరి దేవి

సమస్యలు పరిష్కరించాలని వినతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సివిల్ కాంట్రాక్టర్స్ అడహక్ కమిటీ ప్రతినిధులు ఆదివారం ఎస్ఈ రాజయ్య, ఈఈ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. 'పర్స్ బిల్ పాస్ ఆర్డర్, పెండింగ్ బిల్లులు, పట్టణ ప్రగతి, 15వ ఆర్థిక సంఘం, సీఎం హామీల పథకం బిల్లులు ఇవ్వాలని, 2024-25 ఎస్ఎస్ఆర్ రేట్లు పెంచాలని, పూర్తయిన పనులకు వెంటనే ఎంబీ రికార్డు చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వర్ధన్నపేట, రాయపర్తి, గీసుకొండ, న్యూస్‌టుడే: వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో 1997-98 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్య నేర్పిన గురువులకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. రాయపర్తి మండలంలోని ఉన్నత పాఠశాలలో 2007-08 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా జరిగింది. గీసుకొండ మండలం మరియపురంలోని సెయింట్ జాన్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1999-2000లో ఆ పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు.


వర్ధన్నపేటలో..


రాయపర్తి మండలంలో..


గీసుకొండ మండలం మరియపురంలో..

30న నరకాసుర వధ ఉత్సవాలు

కరీమాబాద్, న్యూస్‌టుడే: వేదపండితుల సూచన మేరకు ఈ నెల 30న రంగలీలా మైదానంలో నరకాసుర వధ ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి తెలిపారు. ఆదివారం ఉర్సులో నిర్వహించిన ఉత్సవ కమిటీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్ల కోసం మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ సుధారాణి, పోలీసు కమిషనర్, బల్దియా కమిషనర్లను కలిసి వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానించినట్లు వివరించారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శతపతి శ్యామలారావు, కోశాధికారి కనుకుంట్ల రవి, సహాయ కార్యదర్శి అవునూరి రామ్మూర్తి, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, కార్యవర్గ సభ్యులు దూడే కొమురెల్లి, మరుపల్ల శివ, అంకం రామనాథం, తౌటం నర్సింహ, కొమ్ము రాజు, పోలం రంజిత్, మంద పవన్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న విద్యుత్తు ప్రమాదం!



వరంగల్ కాశీబుగ్గ ఓసిటీలోని రామాలయం ఎదురుగా ఉన్న రోడ్ నెంబరు 7/ఏ/2లో తుప్పు పట్టిపోయిన విద్యుత్తు జంక్షన్ బాక్స్‌తో ప్రమాదం పొంచి ఉంది. ఏ క్షణంలోనైనా షార్ట్ సర్క్యూట్ అయ్యే ముప్పు ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కాశీబుగ్గ

నియామకం

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: పీఆర్టీయూ(టీఎస్) జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు తాటిపాముల రమేశ్, పిన్నింటి లక్ష్మారెడ్డిలను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. సంఘం అభివృద్ధికి తమవంతుగా కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వివరించారు.

బతుకమ్మ సంబరాలు


పోచమ్మమైదాన్‌లో విద్యార్థినులు

రామన్నపేట, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతం రాజీవ్‌కాలనీ పబ్బా వీరప్రకాశ్ కవిత నివాసంలో నవ దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. శివ పార్వతులు, వినాయకుడు, తులసీ ప్రతిమలతో బతుకమ్మ తయారు చేశారు. మహిళలు ఆటపాటలతో సందడి చేశారు.

పోచమ్మమైదాన్: పోచమ్మమైదాన్‌లోని ధృవ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మ పాటలకు నృత్యాలు చేశారు. కళాశాల ఛైర్మన్ ఆకుల శ్రీనివాస్, డైరెక్టర్లు డా. సంతప్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.


వరంగల్ రాజీవ్ కాలనీలో.. మహిళలు

ఆర్యవైశ్యుల ఐక్యతకు పాటుపడాలి


ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా నూతన కమిటీ ప్రతినిధులతో ప్రమాణం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనారాయణ

రామన్నపేట, న్యూస్‌టుడే: ఆర్యవైశ్య మహాసభకు 120 సంవత్సరాల చరిత్ర ఉందని, రాష్ట్రంలో రెండు లక్షల పైచిలుకు సభ్యత్వాలు ఉన్నాయని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం హంటర్‌రోడ్‌లోని ఓ వేడుకల మందిరంలో ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా దుబ్బ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గార్లపాటిగా నాగేంద్రబాబు, కోశాధికారిగా శ్రీనివాస్ గుప్తాతో పాటు 250 మంది ప్రతినిధులతో ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణలో ఇప్పటికే 28 జిల్లాలో కమిటీలు వేశామని, త్వరలోనే మిగిలినవి వేస్తామన్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే వరంగల్ జిల్లా కమిటీ ఉత్తమంగా పనిచేస్తుందని, సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉన్నామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రేణిగుంట గణేష్ గుప్తా, కొండ్ల మల్లికార్జున్, రామకృష్ణ, ఉప్పుల శారద సుష్మా, చింతల రవి, శ్రీనివాస్‌తో పాటు అన్ని విభాగాల కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: మాజీ మంత్రి కేటీఆర్‌పై ఎక్స్(ట్విట్టర్)లో తప్పుడు ప్రచారం చేశారని ఆరోపిస్తూ.. వరంగల్ తూర్పు భారాస పార్టీ మహిళా నాయకురాలు రాణి ఆదివారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆదేశాల మేరకు 'శ్వేత టీడీపీ' అనే ఖాతా నుంచి తప్పుడు వార్తలు పోస్ట్ చేశారని, బాధ్యులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వక ఫిర్యాదును ఎస్సై సురేష్‌కు అందించారు.

'కోడలు వేధిస్తోంది.. న్యాయం చేయండి'


ఆర్డీవో ఆదేశాల ప్రతులను చూపుతున్న సరోజన

జాన్‌పాక(గీసుకొండ), న్యూస్‌టుడే: తన కోడలు తనను వేధిస్తోందని, పోలీసులు తనకు న్యాయం చేయాలని గీసుకొండ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గొనె సరోజన (65) ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మారంలో ఆదివారం ఆమె విలేకరుల వద్ద తన గోడు వెల్లబోసుకున్నారు. కొద్ది రోజుల క్రితం తన భర్త చేరాలు, కుమారుడు మహేందర్ మృతి చెందారని, తన సొంత ఇంటిలో కోడలు సంధ్యతో కలిసి నివాసం ఉంటున్నానని తెలిపారు. ఇంటి నుంచి వెళ్లిపోవాలని కోడలు తనను ఇబ్బంది పెడుతుండగా వరంగల్ ఆర్డీవోను సంప్రదించానన్నారు. ఆర్డీవో ఇచ్చిన ఆదేశాల ప్రతులను విలేకరులకు చూపించారు.

ఆర్ఎస్ఎస్ వందేళ్ల వేడుకలు


కాశీబుగ్గ వివేకానంద కళాశాలలో..

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: వరంగల్ కాశీబుగ్గ వివేకానంద కళాశాల వేదికగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) వందేళ్ల వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ కాశీబుగ్గ నగరశాఖ ఆధ్వర్యంలో కార్యకర్తలు తొలుత కాశీబుగ్గ పుర వీధుల్లో కవాతు చేశారు. అనంతరం వివేకానంద కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఎన్ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఖానాపురం ఉదయ్‌కుమార్ హాజరై ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం గురించి వివరించారు. సమావేశంలో చాపర్తి ప్రభాకర్, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

శివనగర్: దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆదివారం శివనగర్‌లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు.

బాణసంచా అక్రమ నిల్వ

వరంగల్‌క్రైం, న్యూస్‌టుడే: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా బాణసంచా నిలువ ఉంచిన గోదాంపై ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ కథనం మేరకు... దీపావళి సమీపిస్తుండటంతో వరంగల్ జిల్లా పర్వతగిరికి చెందిన కొత్త రవితేజా కొంతకాలం క్రితం ఎలాంటి అనుమతులు లేకుండా బాణసంచా తీసుకొని వచ్చి ప్రైవేటు గోదాంలో ఉంచారు. విశ్వసనీయ సమాచారం రావడంతో పర్వతగిరి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా దాడి చేసి, రూ.24 లక్షల విలువైన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, ఎస్సై దిలీప్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై కేసు నమోదు

రంగశాయిపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదాలపై మిల్స్ కాలనీ పోలీసులు కేసు నమోదు చేశారు. రామన్నపేటకు చెందిన కొంద్రు రాజు తన ద్విచక్ర వాహనంపై ఖిలావరంగల్ మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బండి మల్లయ్యతో సహా.. రంగశాయిపేట వైపునకు వెళ్తుండగా వాల్ మార్ట్ వద్ద వెనుక నుంచి ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆటో చోదకుడు జాటోతు మధుకర్‌పై బాధితులు ఫిర్యాదు చేశారు.

● సంగెం మండలం ఆశాలపల్లి గ్రామానికి చెందిన వాసం భానుప్రకాశ్ హనుమకొండ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రంగశాయిపేట శివారులోని గణపతి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో కారు ఢీ కొట్టింది. బాధితుడి తండ్రి యాదగిరి ఫిర్యాదు మేరకు కారు నడిపిన మందాటి రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్ తెలిపారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా రాజశేఖర్

దుగ్గొండి, న్యూస్‌టుడే: మహమ్మదాపురం కాకతీయ ఆటో యూనియన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెదురు రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్‌రావు, కోశాధికారిగా దయాకర్, సహాయ కార్యదర్శిగా స్వామి ఎన్నికయ్యారు.

కోదండరాంకు సన్మానం


ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న ఉద్యమకారులు

దుగ్గొండి, న్యూస్‌టుడే: గిర్నిబావిలో ఆదివారం తెలంగాణ ఉద్యమకారులు తెజస రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాంను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐకాస మండల కన్వీనర్ బొనగాని రవీందర్, ఉద్యమకారులు సదానందం, రఘోత్తమరెడ్డి, రమ, లావణ్య, సునితలక్ష్మి, సంధ్య, అయిల్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట నియోజకవర్గం

కాలువల్లో గుర్రపు డెక్క తొలగింపు


కొత్తూరు శివారులో..

ఖానాపురం, న్యూస్‌టుడే: పాకాల తుంగబంధం పంట కాలువల్లో నీటి ప్రవాహానికి గుర్రపు డెక్క అడ్డుగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తూరు శివారులోని దుంపిళ్లగడ్డకు నీరందక పొలాలు ఒడలిపోతున్నాయి. నీటిపారుదలశాఖ అధికారులు ఆదివారం కాల్వల్లో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టారు.

భక్తులు నిబంధనలు పాటించాల్సిందే

రంగంపేట, న్యూస్‌టుడే: శ్రీభద్రకాళి అమ్మవారి దర్శనానికి వస్తున్న వాహనాల నియంత్రణ కోసం వరంగల్ మట్టెవాడ పోలీసులు అమలులోకి తెచ్చిన నిబంధనలు భక్తులు పాటించాలని ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీఎంరోడ్ భద్రకాళి ఆర్చి, రంగంపేట, గ్రేటర్ వరంగల్ కార్యాలయం నుంచి అన్ని రకాలైన వాహనాలు పార్కింగ్ కేంద్రంలో నిలపాలి. తిరిగి వెళ్లేటప్పుడు ఎల్బీ కళాశాల, కాపువాడ స్మార్ట్‌రోడ్డు గుండా వెళ్లాలని పోలీసులు తెలిపారు. ఇన్, అవుట్ నిబంధనలు అందరూ పాటించాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మట్టెవాడ, న్యూస్‌టుడే: దసరా, సద్దుల బతుకమ్మ పండగ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంతేజార్‌గంజ్ ఠాణా సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. ఆదివారం ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు భద్రత సూచనలు తెలిపే ఆటోను ప్రారంభించారు. సీఐ శివకుమార్ మాట్లాడుతూ.. పండగలను పురస్కరించుకొని తగిన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పోలీసుల సూచనలు పాటించాలని కోరారు.

అన్నపై తమ్ముడి దాడి

రంగశాయిపేట, న్యూస్‌టుడే: కుటుంబ తగాదాల కారణంగా అన్నపై తమ్ముడు దాడికి పాల్పడ్డాడు. మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. ఉర్సు ప్రాంతానికి చెందిన ఎండీ.బియాబాని పక్కనే నివసిస్తున్న తమ్ముడు ఎండీ.సుల్తాన్‌కి మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈక్రమంలో ఆదివారం బియాబానితో పాటు అతడి భార్య ఆశాబీని తమ్ముడు అతని భార్య పర్వీన్‌లు కర్రలు, రాళ్లతో దాడి చేసి గాయపర్చారు. బాధితుడు బియాబాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.